"ఆత్మ సాక్షాత్కారం పొందిన ఎవరయినా అబద్ధం చెప్పరు కాబట్టి దాన్ని తాము పొందలేదని చెప్పరు. అలాగే వారు స్వంత గొప్పలు కూడా చెప్పుకోరు కాబట్టి తాము పొందామనీ చెప్పరు. మీ ప్రశ్నకి వారు మౌనంగా వుంటారు కాబట్టి మీకు అలాంటి వారినించి సరైన జవాబు రాదు. వస్తే మాత్రం వారు అబద్ధం చెప్పినట్లవుతుంది."

## 51. అసలైన బేంక్

18వ శతాబ్దంలో కలకత్తాలోని ఓ ప్రధాన వీధిలో నడుస్తున్న ఒక ఇండియన్‌కి ఓ పెద్ద భవంతి కనిపించింది. అందులోకి చాలామంది తెల్లవాళ్ళు వెళ్తూ వస్తూండటం చూసి ఆ బిల్డింగ్‌లో ఏం వుందని ఓ తెల్లవాణ్ణి అడిగాడు.

"అందులో బేంక్ ఆఫ్ ఇంగ్లండ్ ఉంది. తెల్లవాళ్ళు అందులో డబ్బు దాచుకుంటారు. వడ్డీతో సహా ఆ డబ్బుని ఎప్పుడైనా వెనక్కి తిరిగి తీసుకోవచ్చు. మీ అనాగరికులకి ఇలాంటి బేంక్ లేదు." జవాబు చెప్పాడతను.

ఇండియన్ వెంటనే చెప్పాడు.

"నిజమే. మా తండాలో మాకు ఇలాంటి బేంక్ లేదు. కానీ, మాదగ్గర ఎక్కువ డబ్బు కానీ, ఆహార పదార్థాలు, మందులు లేదా దుస్తులు కాని ఉన్నప్పుడు వాటిని అవి లేని ఇతర తండాల వారికి ఇచ్చేస్తాము. అప్పుడు మా హృదయాలు ఎంతో తృప్తిగా, ఆనందంగా ఉంటాయి. మా దగ్గర లేనప్పుడు ఆ ఇతర తండాలవారు తిరిగి మాకు అదే విధమైన సహాయం చేస్తూంటారు. మేం ఇతరులకి ఇవ్వడమే మా బేంక్." చెప్పాడతను.

## 52. ఉప్పులా వుండు

"స్వామీ. నాలో దేవుడున్నాడు కదా?"

"అవును."